# అంతర్లీనం

వీధి వాకిలి దగ్గర నిల్చున్నాడు విష్ణుమూర్తి.

వీధి తలుపులు మూసి వున్నాయి. కుడిచేతిలో వున్న అరలసంచీని ఎడమచేతిలోకి మార్చుకుని కుడిచేతి వేళ్లతో తలుపులమీద చప్పుడు చేశాడు.

లోపల్నించి "ఎవరూ?" అని ఒక ఆడగొంతు అడగటం వినపడింది. అది సరోజిని గొంతు.

"నేనే విష్ణుమూర్తిని" అన్నాడు విష్ణుమూర్తి.

కొన్ని నిముషాల తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. తలుపుల్ని తీసిన సరోజిని ఎదురుగా నవ్వే ప్రయత్నం చేస్తున్నా ఆయన్ని చూసి, "మీరా" అన్నది నవ్వి. తర్వాత వాకిలికి అడ్డు తప్పుకుంది.

విష్ణుమూర్తి లోపలకు వస్తూ, "అవును, నేనే.... లేకపోతే నిజంగా విష్ణుమూర్తి వచ్చాడనుకున్నావా?" అని అడిగాడు నవ్వి.

తలుపులు మూసి గడియపెట్టి తిరిగివస్తూ, "ఇప్పుడు నా పాలిట మీరు నిజంగా విష్ణుమూర్తే విష్ణుమూర్తిగారూ" అన్నది సరోజిని.

"ఎట్టెట్టా?" అనడిగాడు విష్ణుమూర్తి.

వసారాలో నవారుమంచం వాల్చి వుంది. దానిమీద కవర్‌లాగా కుట్టిన పాత సిల్కుచీర మీద ఎరుపు రంగు పువ్వులున్నాయి. విష్ణుమూర్తిని కూర్చోమన్నది సరోజిని.

విష్ణుమూర్తి మంచంమీద కూర్చుని అప్పటివరకు చేతిని ఆశ్రయించి వున్న అరలసంచీని పక్కనే వుంచాడు.

"మీకు తెలిసే నన్నడుగుతున్నారు" అన్నది సరోజిని వసారాలో వున్న గుంజను ఆనుకుని నిల్చుని.

"నాకు తెలీదు – చెప్పు" అని ప్రోత్సహించాడు.

"వైద్యో నారాయణో హరి అన్నారు గదుటండీ. ఆ భారం చూస్తే ఇప్పుడు మీరు నా పాలిట నిజంగా విష్ణుమూర్తే" అని చెప్పింది సరోజిని.

విష్ణుమూర్తి పెద్దగా నవ్వాడు.

"బాగుంది. చాలా బాగుంది" అని ముందుకు వొంగి నవ్వుతున్నవాడల్లా నవ్వటం ఆపి, "మునుస్వామి చెప్పాడు నీ వంట్లో నలతగా వుందనీ ఒకసారి

వచ్చి నన్ను కలవమనీ.... అందుకే వచ్చాను. నీ వొంట్లో ఎలా వుందో చెప్పు.... ఏమిటీ సుస్తీ?" అని విష్ణుమూర్తి అడిగాడు.

విష్ణుమూర్తి ఆ వూళ్లో వున్న ఒకే వైద్యుడు. ఆయుర్వేద వైద్యం చేస్తాడు. ఆ వూళ్లోనే కాకుండా ఆ చుట్టుపట్ల దగ్గరగా వున్న వూళ్లను కూడా సైకిలుమీద వెళ్లి చిన్న చిన్న రోగాలకు మందులిస్తూ వుంటాడు.

తనకి ఒంట్లో నలతగా వుందని ఒకసారి వచ్చి చూడమని విష్ణుమూర్తికి కబురుపెట్టింది సరోజిని. ఎదురింట్లో వుంటే మునుస్వామి అనే ఆయనచేత.

విష్ణుమూర్తి అరలసంచీలో యే అరలో యే మందు వుందో చూసుకుంటున్నాడు. గంజను ఆనుకుని నిలబడిన సరోజిని తన రోగ లక్షణాలను గుర్తుచేసుకుని మరీ అన్నీ విష్ణుమూర్తికి చెప్పింది. వారం రోజులనించీ అలా వుంటోందని కూడా చెప్పింది చివర్లో.

ఆ లక్షణాలనుబట్టి అది ఎటువంటి రోగమో నిర్ధారించుకున్నాడు విష్ణుమూర్తి.

తర్వాత, "కంగారుపడాల్సింది ఏదీ లేదు సరోజినీ. మందులిస్తాను. క్రమం తప్పకుండా వాడు. తగ్గిపోతుంది" అని సంచీలో నించి రెండు రకాల చూర్ణాలను తీసి కాయితంలో పొట్లాం కట్టి ఎలా వాడాలో చెప్పి సరోజిని చేతిలో పెట్టాడు.

సరోజినికి అనుమానం వచ్చింది.

"చూర్ణం మింగి నీళ్లు తాగితే సరిపోతుందా?" అని అడిగింది.

"కాదు. నీళ్లతో పని లేదు. తేనెలో రంగరించి తీసుకోవాలి" అన్నాడు విష్ణుమూర్తి.

సరోజిని మందుల పొట్లాలను తీసుకుని లోపలకు వెళ్లింది. మంచంమీద కూర్చుని చూస్తుంటే ఒక మూలగా ఉన్న వంటగది స్పష్టంగా కనపడుతోంది. చీకటిగా వున్న వంటగదిలో వున్నట్టుండి మెరుపు మెరిసినట్లనిపించింది.

సరోజిని పొయ్యి వెలిగించిందని అనుకున్నాడు విష్ణుమూర్తి. ఆయన మందులన్నింటినీ సంచీలోని అరల్లోకి సర్దుకుని కూర్చున్నాడు వసారా వాకిలి పక్కగా వున్న పటాలను చూస్తూ.

కొంతసేపటికి సరోజిని కాఫీగ్లాసుతో వచ్చి విష్ణుమూర్తి కిచ్చింది.

"ఇప్పుడవన్నీ ఎందుకు సరోజినీ?" అన్నాడు విష్ణుమూర్తి గ్లాసును అందుకుంటూ.

"తీసుకోండి. సాక్షాత్తూ వైద్యనారాయణులు. ఈమాత్రం మర్యాద కూడా చెయ్యకపోతే ఎలాగండీ?" అన్నది సరోజిని.

"అంతేనంటావా? సరే కానీ" అన్నాడు విష్ణుమూర్తి నవ్వి.

"అందులోనూ నా రోగం కుదర్చబోతున్నారు" అన్నది సరోజిని.

మళ్లీ పెద్దగా నవ్వాడు విష్ణుమూర్తి కాఫీ గ్లాసును గట్టిగా పట్టుకుని, "ఈ మాట బావుంది" అన్నాడు కాఫీ గుటకవేసి.

"పోన్లెండి. కబురు చెయ్యగానే వచ్చారు. ఆ మర్యాద నేను నిలుపుకోవద్దూ" అన్నది.

విష్ణుమూర్తి కాఫీ తాగటం ముగించి వొంగి గ్లాసును కిందపెట్టి, "సరోజినీ – ఒక మాట అడుగుతాను. ఏమీ అనుకోవుగదా" అనడిగాడు.

సరోజిని నవ్వి, "ముందు మీరు ఏమడుగుతారో తెలీకుండా అనుకుంటానూ, అనుకోనూ ఎలా చెప్పగలను? ముందు మీరు అడగండి. అనుకోవటంతో మీకెందుకూ?" అన్నది.

"ఏమీ లేదు. నీ పెనిమిటి రామదాసూ, నువ్వూ ఇద్దరూ పెద్దవాళ్లయినారు గదా.... ఇంకెందుకీ పంతాలూ, పట్టింపులూ.... నువ్వు రామదాసు దగ్గరకు పొన్నూరు వెళ్ళరాదూ?" అన్నాడు విష్ణుమూర్తి కొంచెం గొంతు తగ్గించి.

సరోజిని పెద్ద నిట్టూర్పు విడిచింది. ఆమె మొహం అప్రసన్నంగా మారింది. తను భర్తను గుర్తుచేసుకోవటం, ఎవరయినా భర్తను గుర్తుచెయ్యటం సరోజినికి ఇష్టం వుండదు. పొరపాటున ఎవరయినా గుర్తుచేస్తే ఇదిగో మొహం ఇలాగే మారిపోతుంది.

"ఆయనగారి మీద నాకు ప్రేమ, ఇష్టం వున్నా నా మీద ఆయనకు ఆ రెండూ లేవు. ఆయనకు మనుషుల మీద కంటే వాళ్ల తాలూకు డబ్బు, ఆస్తి మీదనే ప్రేమా, ఇష్టం వుంటాయి. ఈ విషయం అందరికీ తెలుసు. ఆయన ఎటువంటి మనిషో తెలిసి కూడా ఆయన దగ్గరికి ఎట్లా పోయేది?" అనడిగింది సరోజిని.

విష్ణుమూర్తి మాట్లాడలేక మౌనం పూనాడు.

సరోజిని మాటల్లో నూటికి నూరుపాళ్ళు నిజమున్నది. రామదాసు డబ్బు మనిషి. ఆయనకు సంపద మీద ఎవలేని ప్రేమ. ఆయన సరోజిని మెళ్లో మూడుముళ్ళు వేసేనాటికే ఆయన మొదటి భార్య ఒక కొడుకు కని ఏదో రోగంతో చనిపోయింది. కొంత దూరపు బంధుత్వం కూడా వుండటంతో సరోజినిని

రామదాసుకు రెండో భార్యగా చేశారు ఆమె వైపు వాళ్లు. పెళ్లిలో పుట్టింటి పసుపు కుంకుమ కింద ఆమె తండ్రి ఐదెకరాల మాగాణి భూమిని సరోజినికి రాసిచ్చాడు. సరోజిని పెళ్ళయి ఆరేళ్లయినా ఆమెకు పిల్లలు పుట్టలేదు. రామదాసు యేమనుకున్నాడో యేమోగానీ భార్య పేరున ఉన్న అయిదెకరాల మాగాణి భూమినీ తన పేరున రాయమన్నాడు. సరోజిని ఒప్పుకోలేదు. ఆమెకు ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లెలు వున్నారు. రామదాసు మనసులో యేముందో సరోజిని పసిగట్టి వుంటుంది. రామదాసు వూరుకోలేదు. సరోజినితో గొడవపడ్డాడు. సరోజిని తన పట్టు వీడలేదు. ఫలితం రామదాసు కోపంతో సరోజిని తనని వదలి ఆ ఇంట్లో నించి వెళ్లిపొమ్మన్నాడు. సరోజిని ఎలాగూ ఫీలవకుండా భర్తను వదిలి పుసులారు అనే పల్లెటూళ్లో తను పుట్టిపెరిగిన లంకంత పుట్టింటికి వచ్చి ఆ ఇంట్లో తన ఒంటరి జీవితాన్ని ప్రారంభించింది.

❖ ❖ ❖

ఆ సాయంత్రంవేళ విష్ణుమూర్తి – సరోజిని ఇంట్లో నించి బయటకు వచ్చి రోడెక్కాడు. అప్పుడు ఆయనకు ఆ వూళ్లో ఉన్న మోతుబరి రైతుల్లో ఒకడయిన నల్లప్పయ్య ఎదురయినాడు.

విష్ణుమూర్తిని చూసి ఆగి – సరోజిని ఆరోగ్యం ఎలా ఉందని అడిగాడు. బాగానే వుందని చెప్పాడు విష్ణుమూర్తి.

"సరోజిని ఆరోగ్యం బాగుంటే ఇంకా ఈ ఇంటితో నీకేం పని?" అనడిగాడు నల్లప్పయ్య రౌద్రంగా చూస్తూ. ఆయన సరోజిని దూరపు బంధువుల్లో ఒకడని విష్ణుమూర్తికి తెలుసు.

యేం చెప్పాలో తెలీక విష్ణుమూర్తి మౌనంగా వెళ్లిపోయాడు.

నల్లప్పయ్యకు అంత కోపం ఎందుకు వచ్చిందో విష్ణుమూర్తికి అర్థం కాలేదు. వైద్యం నిమిత్తం తను సరోజిని ఇంటికి తరచు రాకూడదా? వస్తే తప్పేమిటి? నల్లప్పయ్యనే అడిగితే చెప్పేవాడేమో!

ఆ విషయం గురించి ఆలోచిస్తూ ఇల్లు చేరాడు. ఎంత మరచిపోదామన్నా నల్లప్పయ్య కోపంతో అన్న మాటలు గుర్తుకు వస్తూనే వున్నాయి.

విష్ణుమూర్తి ఆ రాత్రి సరిగా నిద్రపోలేదు.

తెల్లవారింది. సరోజిని ఇంటికి వెళదామనుకున్నాడు. కానీ వెళ్లలేదు. కారణం తెలియాలి. తెలిసిన తర్వాతనే వెళ్లాలనుకున్నాడు.

రెండు రోజులు గడిచాయి.

ఈ రెండు రోజుల్లో విష్ణుమూర్తికి సరోజిని దగ్గర్నించి ఎలాంటి కబురు రాలేదు. ఏదయినా అవసరం ఉంటే సరోజిని ఎదురింటి మనిషిచేత కబురు చేస్తుంది.

ఈ రెండు రోజులూ విష్ణుమూర్తి బయట వూళ్లకు వెళ్లాడు వైద్యం నిమిత్తం.

మూడో రోజు ఉదయం విష్ణుమూర్తి సైకిలు మీద సరోజిని ఇంటికి వెళ్లాడు. ఇంటి బయట ఎవరో ఒక మగాయన సరోజినితో మాట్లాడుతూ కనిపించాడు. విష్ణుమూర్తి సైకిలు దిగుతూ ఇప్పుడు ఆ మగ మనిషిని గుర్తించాడు.

నల్లప్పయ్య!

సైకిలు దిగి నిలబడిన విష్ణుమూర్తిని చూసి – "మళ్లీ వచ్చావా?" అన్నాడు కోపంగా నల్లప్పయ్య.

విష్ణుమూర్తి తల దించుకున్నాడు.

నల్లప్పయ్య మంచివాడు కాదని అందరికీ తెలుసు.

"ఎందుకు ఈ మనిషిని ఇంటికి రానిస్తావ్?" అన్నాడు నల్లప్పయ్య సరోజిని వైపు చూసి.

"వొంట్లో బాగోలేదు. తప్పేముంది?" అన్నది సరోజిని.

"నీకు తప్పుగా అనిపించదు. అంతా నిన్నే తప్పుబడుతున్నారు. వూళ్లో నీ గురించి యేమనుకుంటున్నారో నీకు తెలుసా?" అన్నాడు మళ్లీ.

"నువ్వే చెప్పు. నాకు తెలీదు" అన్నది సరోజిని.

"నువ్వు ఈ విష్ణుమూర్తిని చేరదీశావుట. మీ ఇద్దరి మధ్యనా ఏదో వుందిట. అందుకే ఈయన రోజూ నీ ఇంటికి వస్తున్నాడట. వైద్యమనేది ఒక వంక మాత్రమేనట"

సరోజిని వినలేక చెవులు మూసుకుంది.

విష్ణుమూర్తికి మతిపోయినట్లయింది.

"ఎవరేమనుకున్నా నాకు లెక్కలేదు. ఎందుకంటే నిజానికి మా మధ్య యేమీ లేదు. ఒక మంచి మనిషిగా విష్ణుమూర్తిగారంటే నాకు అభిమానం వుంది. ఒక వైద్యుడిగా గౌరవం ఉంది. ఇంతకుమించి మా మధ్య ఎలాంటి సంబంధం లేదు. నా మనస్సే నాకు సాక్షి. సంస్కారం లేని మనుషుల మాటలను నేను

ఖాతరు చెయ్యను" అన్నిది సరోజిని గట్టిగా.

నల్లప్పయ్య మొహం మాడిపోయింది.

సరోజిని లోకనిందకు భయపడుతుందని అనుకున్నాడు. కాని కాదు. ఒక స్థిర నిశ్చయంతో ఉన్నదానిలా అగుపడింది. భర్తనే లెక్కచెయ్యని ఆడది ఈ లోకులకు భయపడుతుందా?

కొంతసేపటికి నల్లప్పయ్య వెళ్లిపోయాడు.

ఇంట్లోకి వచ్చాక, "బాధపడకండి విష్ణుమూర్తిగారూ – ఈ లోకం గుడ్డిది" అన్నది సరోజిని ఆయనతో.

విష్ణుమూర్తి నవ్వి, "నీ మాటలు వింటే ఆశ్చర్యం కలిగింది. ఎంత నిర్భయంగా మాట్లాడావు?" అన్నాడు మెచ్చుకోలుగా.

"మనసులో యేమీ లేనప్పుడు నేనెందుకు భయపడాలి? నిజానికి ఎవర్నియినా చేరదీసే ఆలోచనే వుంటే ఎప్పుడో చేరదీసేదాన్ని. ఇంత వయసు వచ్చినదాకా ఎందుకు వుండేదాన్ని? ఇవన్నీ మతి లేనివాళ్ళ మాటలు. పట్టించుకోవాల్సిన పనిలేదు. మీరు మామూలుగానే మా ఇంటికి రండి" అన్నది సరోజిని.

"ఈ నల్లప్పయ్య వూరుకుంటాడా?"

సరోజిని తేలిగ్గా నవ్వి, "ఈ నల్లప్పయ్య ఎర్ర సుబ్బయ్యలాంటి వాళ్లకు భయపడాల్సిన అవసరం లేదు. నేను ఎవర్నయినా ఎదుర్కుంటాను" అన్నది.

"నేను మగాడినయినా నీకున్నపాటి ధైర్యం నాకు లేదు సరోజినీ" అన్నాడు విష్ణుమూర్తి.

"మన ప్రవర్తనే మనకు ధైర్యానిస్తుంది" అన్నది సరోజిని. విష్ణుమూర్తి ఆమె ఆరోగ్యానికి సంబంధించిన కొన్ని ప్రశ్నలడిగి కొన్నిరకాల మందులు ఇచ్చి ఇంటికి వెళ్లాడు.

❖ ❖ ❖

అర్ధరాత్రి దాటినాక ఎవరో తలుపులు కొడుతుంటే సావిత్రమ్మకు మెలకువ వచ్చింది. పక్కనే వున్న మంచం మీద విష్ణుమూర్తి నిద్రపోతున్నాడు.

సావిత్రమ్మ బద్ధకాన్ని వదిలించుకుని మంచం దిగి వెళ్ళి వీధి తలుపులు తీసింది.

ఎదురుగా ముసుగు కప్పుకుని సరోజిని.

సావిత్రమ్మకు సరోజిని బాగానే తెలుసు – భర్త విష్ణుమూర్తికోసం అప్పుడప్పుడు వస్తూ వుంటుంది కాబట్టి.

"నువ్వా?" అన్నది ఆశ్చర్యంగా.

"అవునమ్మా.... విష్ణుమూర్తిగారిని నిద్రలేపితే కొంచెం మాట్లాడి వెళ్లిపోతాను" అన్నది సరోజిని.

సావిత్రమ్మ చేతిలో లాంతరు వుంది. లాంతరు వెలుతురు సరోజిని మొహం మీద పడుతోంది. సరోజిని గొంతు వణకటాన్ని సావిత్రమ్మ గుర్తించింది.

"ఏం జరిగింది సరోజినీ?" – ఉండబట్టలేక అడిగింది సావిత్రమ్మ.

"విష్ణుమూర్తిగారితో చెబుతాను. ముందు ఆయన్ని నిద్రలేపండి" అన్నది తొందరపడుతూ.

సావిత్రమ్మ ఇక ఆలస్యం చెయ్యలేదు. గబగబా వెళ్లి భర్త విష్ణుమూర్తిని నిద్రలేపింది.

విష్ణుమూర్తి ఆశ్చర్యానికి అంతులేదు.

ఇంత రాత్రివేళ సరోజిని ఒంటరిగా.... ఎవరికంటా పడకుండా.... రహస్యంగా.... అంటే యేదో ముఖ్యమయిన పనిమీదే వచ్చి ఉంటుంది.

"చెప్పు సరోజినీ" అడిగాజు విష్ణుమూర్తి వచ్చి.

గోడను ఆనుకుని నిలబడింది సరోజిని చీకట్లో.

సావిత్రమ్మ లాంతరును వసారాలో గోడకు తగిలించింది వత్తి తగ్గించి. వెలుగు తగ్గిపోయింది.

"ఎలా చెప్పాలో తెలీడం లేదు" అన్నది సరోజిని.

"ఎట్లాగో చెప్పు.... ఎప్పుడయినా తప్పదు" అన్నాడు విష్ణుమూర్తి.

చివరకు మాటలను కూడగట్టుకుని అసలు విషయాన్ని చెప్పింది సరోజిని.

సావిత్రమ్మ కళ్లు పెద్దవయినాయి. భయంతో భర్తను చూసింది. యేడుపు వచ్చింది.

విష్ణుమూర్తి అయితే గుండె రాయి చేసుకున్నాడు.

❖ ❖ ❖

ఆ మర్నాడు విష్ణుమూర్తి సైకిలు మీద పొరుగూరికి వెలుతున్నప్పుడు ఎత్తుగా పెరిగిన పైర్ల మధ్య దాక్కుని విష్ణుమూర్తిని అంతం చెయ్యటానికి నల్లప్పయ్య వర్గంవాళ్ళు కుట్రపన్నారుట. అందుకని కొన్ని రోజులపాటు విష్ణుమూర్తిని ఇల్లు దాటి బయటకు వెళ్లవద్దని హెచ్చరించింది సరోజిని.

ఇదీ సరోజిని అర్ధరాత్రి రాకలోని ఆంతర్యం.

భర్తను ఇంట్లోనించి బయటకు పోనివ్వద్దని సావిత్రమ్మకు మరీ మరీ చెప్పి నెత్తిమీద ముసుగు కప్పుకుని చీకట్లో వెళ్లిపోయింది సరోజిని.

ఆ రాత్రి ఆ భార్యాభర్తలు నిద్రపోలేదు.

సరోజిని కూడా విష్ణుమూర్తిని ఎలా కాపాడుకోవాలా అని ఆలోచిస్తూనే ఉంది. నిద్రపోలేదు రాత్రంతా.

తెల్లవారింది. తెల్లవారుతూనే తమ బంధువుల అబ్బాయిచేత విజయవాడలో ఉద్యోగం చేస్తున్న తమ కొడుకు రామ్మూర్తికి విషయాన్ని చేరవేసింది సావిత్రమ్మ.

ఆ మర్నాడు ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా మెరుపుల్లాంటి నలుగురు మనుషులను తీసుకుని రామ్మూర్తి కార్లో వచ్చి తల్లిదండ్రులను విజయవాడకు తీసుకువెళ్లాడు.

ఇక విష్ణుమూర్తి వైద్యం మానేసినట్లే!

విష్ణుమూర్తి ఆ వూరు వదిలి వెళ్లినందుకు అందరికంటే నల్లప్పయ్య ఎక్కువగా సంతోషించాడు.

విష్ణుమూర్తి ఆ వూరు వదిలిన కొన్ని రోజులకే ఆ ఊళ్లో తనకు వున్న ఇంటినీ, పొలాన్నీ అయినకాడికి తెగనమ్మి సరోజిని కూడా విజయవాడకు చేరింది.

సరోజిని అలా చెయ్యటంలో విష్ణుమూర్తికీ, సరోజిని మధ్య యేదో సంబంధం వుందని ఆ వూళ్లో పురుగులుదీస్తున్న నీలివార్తకు ఇంకొంత ఊతమిచ్చినట్టుగా అయ్యింది. తనది కేవలం అనుమానం కాదనీ నిజమేనని రూఢి అయ్యిందనీ నల్లప్పయ్య ఊరి జనాలకు చెప్పుకున్నాడు.

నిజానికీ విష్ణుమూర్తికీ, సరోజినీ మధ్య స్నేహం కానీ, ప్రేమ కానీ లేవు. శారీరక వాంఛలను తీర్చుకోవాలనుకునే వయసూ, వేడీ రెండూ లేవు.

కానీ విటన్నింటినీ మించి వాళ్ళిద్దరి మధాయనా యేక భావం అంతర్లీనంగా బలపడి వుంది. అది ఎవరికీ అర్థం కాదు. ❖

*రచన మాసపత్రిక, నవంబరు 2013*